# ఇంతేనా ఈ జీవితం

సాధారణంగా తొమ్మిది దాటితేగాని, రైస్‌మిల్లు నుంచి కదలని కొండయ్య, ఆ రోజు ఐదు గంటల వేళ, తన పనులు పక్కవాడికి అప్పగించి, మిల్లు రణగొణ ధ్వనుల నుంచి బయటికి వచ్చాడు.

పక్కనే గోడవారగా ఒక పెద్ద నీళ్ళ తొట్టె ఉన్నది.

కొండయ్య అక్కడ కాళ్ళు చేతులూ, ముఖం కడుక్కుని. తలకు చుట్టుకున్న తువ్వాలు విప్పి ముఖం తుడుచుకుంటూ, మిల్లు యజమాని సర్పంచే దేవేంద్రయ్య సమక్షానికి నడిచాడు.

విశాలంగా ఉన్న సిమెంట్ కళ్ళంలో, ఒక మూలగా వున్న పెద్ద కుర్చీలో కూర్చుని, దేవేంద్రయ్య చుట్టూ ఉన్న వాళ్ళకు పనులు పురమాయిస్తూ, మధ్య మధ్య గట్టిగా కసురుకుంటున్నాడు. ఆయనకా మధ్య ఒకసారి గుండెపోటు వచ్చింది. వైద్యుడు కోపం, ఆవేశం లాంటివి తగ్గించుకోకపోతే ప్రమాదం అని హెచ్చరించాడు.

'నేను మిల్లు ఓనర్నీ, గ్రామ సర్పంచ్‌నీ, అలాంటి నాకు అంతో ఇంతో కోపం, ఆవేశం లేకపోతే, నన్నెవరు ఖాతరు చేస్తారు?' అనేవాడు దేవేంద్రయ్య.

కొండయ్య తనను సమీపిస్తూండడం చూస్తూనే దేవేంద్రయ్య కనుబొమలు ముడిచి, "ఏరా కొండా! అప్పుడే కామందులా బయలుదేరావు? నీలాంటి వాళ్ళను నమ్ముకుంటే కమతం సాగినట్టే" అన్నాడు.

కొండయ్య తువాలును నడుంకు చుట్టుకుంటూ, "పట్నం నుంచి, మా ప్రకాశం వస్తున్నాడు బాబూ! వాణ్ని స్టేషన్‌కెళ్ళి తీసుకురావాలి" అన్నాడు.

"ఎవడూ! పట్నంలో డాక్టర్ చదువు వెలగబెడుతున్న, నీ తమ్ముడు కొడుకా?" అన్నాడు దేవేంద్రయ్య.

"అవును, బాబూ!" అన్నాడు కొండయ్య.

దేవేంద్రయ్య ఒక క్షణం ఆగి, "ఇల్లూ వాకిలీ, పొలం పుట్రా, గొడ్డూ గోదా అంటూ, ఇంత ఆస్తిపాస్తులన్న మా వల్లనే కాలేదు, పిల్లల్ని పై చదువులకు పంపాలంటే. మీకు సరిగా నిలవ నీడ లేదు - అయినా డాక్టర్ చదువులు, ఏం చేస్తాం, అంతా కలి మహత్యం సరే, ప్రకాశం ఎప్పుడొస్తాడేంటి?" అని అడిగాడు.

"ఇయ్యాల ఆరుగంటల బండి కొస్తున్నట్టు ఉత్తరం వచ్చింది, బాబూ!" అన్నాడు కొండయ్య.

"అయితే, వచ్చే దొరగారికి నువ్వు ఎదురెళ్ళి స్వాగతం పలకాలా? తిన్నగా నడిచి ఇంటికి

రాలేదు?" అన్నాడు దేవేంద్రయ్య వెటకారంగా.

"ఊరొదిలెల్లి ఐదారేళ్ళయింది కదండీ. అందుకని, నేనే స్టేషనుకు పోదామనుకున్నాను" అన్నాడు కొండయ్య బతిమాలుతున్నట్టు.

"సరిసరి, తొందరగా తగలడు!" అంటూ కుర్చీలోంచి లేచాడు దేవేంద్రయ్య.

కొండయ్య పరుగులాంటి నడకతో ఫ్యాక్టరీ గేటు చేరేసరికి, అక్కడ అన్న మాట ప్రకారం ఖాదర్ గుర్రబ్బండీలో సిద్ధంగా ఉన్నాడు. కొండయ్య బండీ ఎక్కి కూర్చున్నాడు.

బండి రైల్వేస్టేషన్ కేసి కదిలింది.

అటు పట్నమూ, ఇటు పల్లే కాని పెద్ద గ్రామం అది. అప్పుడెప్పుడో పోలీస్ స్టేషన్, ఈ మధ్యనే పంచాయితీ సమితి ఆఫీసు, రిజిస్ట్రార్ ఆఫీస్ లాంటివి రావడంతో, రోజు రోజుకూ ఆ గ్రామం రూపురేఖలు మారడంతో పాటు, దాని సరిహద్దులు కూడా విస్తరించిపోతున్నాయి.

ఇన్ని మార్పులు వచ్చినా, గ్రామానికీ, దానికి తూర్పుగా ఉన్న గూడేనికి ఉన్న దూరం మాత్రం తగ్గలేదు. గ్రామం వాళ్ళ పొలం పనుల నుంచీ, ఇంటి పనుల వరకూ ఎక్కువగా చేసేది గూడెం కూలీలే. కానీ, వాళ్ళకు గ్రామ సమిష్టి జీవితంలో ఆవగింజంత పాలు లేదు. వాళ్ళ మంచి నీటి బావి వేరు, వాళ్ళ శ్మశానం వేరు.

కొండయ్య ఎక్కిన గుర్రబ్బండి, సాయంత్రం ఆరు గంటలకల్లా స్టేషన్ చేరింది. కాని, ఆరు గంటలకు రావలసిన రైలు, ఏడుంబావుగ్గాని స్టేషన్ చేరలేదు.

కొంచెం బక్కపలచగా, పొడుగ్గా వుండి స్లాకు-ప్యాంటుతో, కళ్ళద్దాలు పెట్టుకుని, చేతిలో సూట్‌కేసుతో బండి దిగిన ప్రకాశాన్ని చూడగానే కొండయ్య ఎంతగానో పొంగిపోయాడు. గబగబా వెళ్ళి సూట్‌కేస్ తన చేతికి తీసుకుని, గుర్రబ్బండి కేసి నడిచాడు. ప్రకాశం పెదనాన్నకూ, ఖాదర్‌నూ, చిరునవ్వుతో పలకరించి గుర్రబ్బండి ఎక్కి కూర్చున్నాడు.

బండి గూడెం కేసి కదిలింది.

ప్రకాశం, కొండయ్య తమ్ముడైన ముత్తయ్య కొడుకు. ముత్తయ్య ఆ కాలంలోనే - ముప్పై యేళ్ళ కిందటే - గూడెంలో అంతకు ముందెన్నడూ కని విని ఎరగని ఘనకార్యం సాధించాడు. అంటే ఎనిమిదో క్లాసు పాసై, ఎలిమెంటరీ స్కూలు టీచరు ఉద్యోగం సంపాయించగలిగాడు. ఇది అప్పట్లో చాలా మందికి అద్భుతం అనిపించింది.

ముత్తయ్య భార్య ప్రకాశాన్ని కని ఏడాది తిరక్కుండానే చనిపోయింది. తన కొడుకును, తనకన్న విద్యావంతుణ్ణి చేయాలని దీక్ష బూనాడు ముత్తయ్య. ప్రకాశం కూడా శ్రద్ధగా చదివి ఇంటర్‌లో బాగా మార్కులు తెచ్చుకున్నాడు. అందువల్ల మెడిసన్‌లో సీటు రావడమే కాకుండా, ఫ్రీ హాస్టల్ సదుపాయం, ఉపకార వేతనం కింద యేటా మంచి మొత్తమే, ప్రభుత్వం నుంచి ప్రకాశానికి అందింది. అయితే, ముత్తయ్య తన కోర్కె నెరవేరే ముందే, ఒక యాక్సిడెంట్‌లో ప్రాణాలు కోల్పో యాడు. ఇప్పుడు హౌస్ సర్జన్ షిప్ కూడా పూర్తి చేసి, ముత్తయ్య కొడుకు డాక్టర్ ప్రకాశం ఎం.బి.బి.ఎస్‌గా తన గూడేనికి తిరిగి వస్తున్నాడు.

గుర్రబ్బండి గూడెంలో పెద్ద పాకలాంటి కొండయ్య ఇంటి ముందు ఆగింది.

కొండయ్య ముందుగా దిగి సూట్‌కేస్ అందుకొన్నాడు.

ప్రకాశం స్నానం చేసి, యింత తిని వాకిట్లో నవారు మంచం మీద నడుం వాల్చాడు.

పుచ్చ పువ్వులా వెన్నెల కాస్తున్నది.

వాతావరణం చాలా ప్రశాంతంగా ఉన్నది.

పదిమంది గొప్పగా చెప్పుకునే విధంగా, తను పుట్టి పెరిగిన ఊరికి సేవ చేయాలన్న తన తండ్రి ఆశయం నెరవేరే సమయం ఆసన్నమయిందన్న ఆనందం కొద్దీ ప్రకాశానికి అర్ధరాత్రి వరకు నిద్రపట్టలేదు.

పొద్దున ఎనిమిదింటికల్లా దేవేంద్రయ్య ఇంటికి బయలు దేరాడు, ప్రకాశం.

ప్రకాశాన్ని చూస్తూనే దేవేంద్రయ్య ముందుగా, “మీ పెద్దయ్య ఇంకా పనిలోకి రాలేదేం?” అని, తరవాత, “ఏం, ప్రకాశం ఎప్పుడొచ్చావ్?” అంటూ పరామర్శించాడు.

“రాత్రి వచ్చానండీ” అన్నాడు ప్రకాశం.

“చదువయిపోయిందా, ఇంకా ఉందా?” అన్నాడు దేవేంద్రయ్య.

“పూర్తయిందండీ” అన్నాడు ప్రకాశం.

“మరి ఏం చేయబోతున్నావేటి? పట్నంలోనే ఉద్యోగం చూసుకుంటావా? మీకేం – పెట్టి పుట్టిన వాళ్ళు. మీ సర్కారు. సర్కారోడే పిలిచి ఉద్యోగమిస్తాడే” అన్నాడు దేవేంద్రయ్య కంఠ స్వరంలో హాస్యం, హేళన కనబరుస్తూ.

ప్రకాశం ఒక్క క్షణం విస్తుబోయి, “పట్నంలో కాదండి, ఇక్కడే ఉండాలనుకుంటున్నాను” అన్నాడు.

“అదేంటి? అంతగా డాక్టర్ చదువు చదివి ఇక్కడేం చేస్తావయ్యా? పట్నంలో అయితే రెండు చేతులా సంపాయించొచ్చుగదా!” అన్నాడు దేవేంద్రయ్య.

“సంపాదన మాట ఎలా ఉన్నా, నేను బాగా చదివి ఇక్కడివారికి సేవ చెయ్యాలని మా నాన్న ఆశ పడ్డాడండి” అన్నాడు ప్రకాశం.

దేవేంద్రయ్య కనుబొమ్మలు ఆడిస్తూ ఆశ్చర్యంగా ప్రకాశం కేసి చూసి, “సేవా! ఓహోఁ, ప్రజా సేవలో దిగుతున్నవా? అయితే, యింకేం త్వరలో ప్రజానాయకుడివై పోతావ్. కాని ఈ గూడెంలో ఏం చేస్తావ్, నా వల్లకాదు” అన్నాడు.

దేవేంద్రయ్య మాటలు ధోరణి ప్రకాశానికి చాలా బాధ కలిగించింది. అయినా, ఎంతో శాంతంగా, “మీ దయ ఉంటే – మీ మిల్లుకు అవతల, గుంట పక్కన ఉన్న ఖాళీ స్థలంలో, ఆస్పత్రి కట్టుకోవా లనుకుంటున్నానండి. అది పోరంబోకు భూమే కదా” అన్నాడు.

ప్రకాశం మాట పూర్తి చేసే లోపలే, దేవేంద్రయ్య ఆవేశంతో నిలువెల్లా వణికిపోతూ, “ఒరే నీ కెన్ని గుండెలు! అంటరాని వెధవ్వి.... గ్రామానికి తల మీద ఉన్న, నా రైస్ మిల్లు దగ్గిరే స్థలం దురాక్రమణ చేస్తానంటావ్? అసలు, నీవీ గ్రామంలో ప్రాణాలతో తిరగాలనుకుంటున్నావా లేదా!”

అంటూ గట్టిగా గుండెలు పట్టుకుని దభీమంటూ విరుచుకు పడిపోయాడు.

"బాబుగారికేమైంది? బాబాగారి కేమైంది?" అంటూ దాపులనున్న నలుగురైదుగురు పనివాళ్ళు దేవేంద్రయ్య చుట్టూ మూగారు.

ప్రకాశం ఆయన నాడి చూసి, వాళ్ళతో, "త్వరగా మా ఇంటికెళ్ళి నా మందుల పెట్టె పట్టుకు రండి" అన్నాడు.

కొద్దిసేపటి తర్వాత కొండయ్య మందుల పెట్టెతో అక్కడికి వచ్చాడు.

దేవేంద్రయ్యను అక్కడ ఉన్న ఒక బెంచీ మీదికి చేర్చి, ప్రకాశం ఆయనకు ఇన్‌జెక్షన్ ఇచ్చాడు.

అంతలో అక్కడికి దేవేంద్రయ్య భార్య లక్ష్మమ్మ పరిగెత్తుకుంటూ వస్తూనే, "ఇంతకు ముందు వచ్చిన గుండె పోటప్పుడే కోపతాపల్లాంటివి తగ్గించుకోమని ఎంతగానో మొత్తుకున్నాను. నా మాట చెవి కెక్కింది కాదు. ఇప్పుడు దేవుళ్ళా సమయానికి ప్రకాశం ఉండబట్టి సరిపోయింది" అంటూ కళ్ళు తుడుచుకున్నది.

ఆ తరువాత కొద్దిసేపటికి దేవేంద్రయ్య కళ్ళు తెరచి లేచి కూర్చున్నాడు.

ప్రకాశానికి ఆయన అన్న మాటలు అవమానంగా తోచి మనసు వికలమై పోయింది. ఇన్నేళ్ళ పాటు కష్టపడి నేర్చిన విద్య వల్ల ప్రయోజనం ఏమిటి? దేవేంద్రయ్య దృష్టిలో తను డాక్టరు కాదు. కూలిపని చేసుకు బతికే కొండయ్య తమ్ముడి కొడుకు... మరొక అంటరానివాడు!

ఆ రాత్రి ప్రకాశానికి అన్నం సహించింది కాదు.

తను డాక్టరై సాధించ గలిగిందేమిటి? కనీసం ఆత్మగౌరవాన్ని కూడా కాపాడుకోలేకపోయాడు. ఇంతేనా ఈ జీవితం అన్న బాధా, సమస్యా అతడికి ఆ రాత్రి నిద్ర లేకుండానే చేసినై.

ఆ మర్నాడు తొమ్మిది గంటలకు దేవేంద్రయ్య నుంచి ప్రకాశానికి కబురు వచ్చింది.

క్షణాకలం వెళ్ళడమా, మానడమా అన్న సంశయంలో పడిన ప్రకాశం, ఆ వెంటనే ఆయన తను చికిత్స చేసిన రోగి అన్న సంగతి గుర్తుకు తెచ్చుకుని, గబ గబా బయలుదేరాడు.

ప్రకాశం రాగానే దేవేంద్రయ్య ఎంతో మర్యాదగా, "రా, ప్రకాశం, కూర్చో" అంటూ ఒక కుర్చీ చూపించాడు.

ఆ మర్యాదకు ప్రకాశం ఆశ్చర్యపోయి, ఒంట్లో ఎలా ఉన్నదని అడగబోయేంతలో, లక్ష్మమ్మ ముఖం నిండా పసుపు రాసుకుని, రూపాయంత కుంకుమ బొట్టుతో కాఫీ గ్లాసు చేత బట్టుకుని అక్కడికి వచ్చి, "తీసుకో, నాయనా!" అంటూ గ్లాసును ప్రకాశాని కిచ్చింది.

ప్రకాశం కాఫీ తాగి, దేవేంద్రయ్యతో, "రాత్రి మామూలుగా నిద్ర పట్టింది గదాండి? కాసేపాగి మరొక ఇన్‌జెక్షన్ ఇస్తాను. ఒకటి రెండు వారాలు పని భారం పెట్టుకోక, విశ్రాంతి తీసుకోవడం అవసరం" అన్నాడు.

దేవేంద్రయ్య చిరునవ్వుతో ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

లక్షమ్మ భర్త వెళ్ళిన దిక్కుకేసి చూసి, "నిన్న జరిగినదంతా, రాత్రి ఆయన నాతో చెప్పారు, ప్రకాశం. ఇప్పుడు కొత్త కొత్త మందులు కనిపెట్టడం వల్ల కలరా, మశూచీ లాంటి భయంకర

వ్యాధులు మటుమాయమయ్యాయిగదా! మరి ఎందరో మహనీయులు పుట్టి, ఎన్నో నీతులు బోధించినా, మన జీవితాలను మహమ్మారిలా వేధిస్తున్న కులమత ద్వేషాలు ఎందుకు మాసిపోలేదు? పుట్టుకతోనే కొందరు అధికులూ, కొందరు అంటరానివాళ్ళూ అని మూఢంగా నమ్మే మనమూ, మనుషులమేనా?" అన్నది.

ప్రకాశం ఆమెలోని మంచితనాన్నీ, వివేకాన్నీ మనసులోనే మెచ్చుకుంటూ, తల వంచుకుని మౌనంగా వినసాగాడు.

లక్ష్మమ్మ ఒక క్షణం ఆగి, "పొలాల్లో చెమటోడ్చటానికి, మిల్లులో కూలీ పని చేయడానికి అడ్డు రాని, ఈ అంటరానితనం, ఇంటి ముందుకు వచ్చేసరికి విషసర్పంలా పడగ విప్పుతుంది. నా మాటల్లో సత్యమో లేక గుండె నొప్పి ప్రభావమోగాని ఆయన పూర్తిగా మారిపోయారు" అన్నది.

ఇంతలోనే దేవేంద్రయ్య ఇంట్లో నుంచి అక్కడికి వచ్చి, ప్రకాశంతో, "చిన్నవాడివైనా చెబుతున్నాను - ఈ జన్మకు నీ మేలు మరవను. మిల్లుకు అవతల ఉన్న ఖాళీస్థలంలో, ఆస్పత్రి, ఇల్లూ - రెండూ కట్టుకో. అందుకు అవసరమయిన ధన సహాయం చేస్తాను" అన్నాడు.

కొంచెం దూరంలో నిలబడి అంతా విన్న కొండయ్య, దేవేంద్రయ్యలో వచ్చిన మార్పుకు చాలా ఆశ్చర్యపోయాడు.

అతడి నేత్రాలు ఆనందాశ్రువులతో మెరిశాయి.

*(ఆకాశవాణి - మద్రాసు కేంద్రం నుండి ప్రసారితం :: వాణి : 22-09-1984)*

